మలేరియా గుర్తింపులో ఆశాలదే కీలక పాత్ర

జియ్యమ్మవలస, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మలేరియా గుర్తింపులో ఆశా వర్కర్లదే కీలక పాత్ర అని జిల్లా సహాయ మలేరియా అధికారి సూర్య నారాయణ తెలిపారు. సోమవారం రావాడ రామభద్రపురం పీహెచ్‌సీని సందర్శించారు. ఈ సందర్భంగా మలేరియా టెస్టులు చేసే విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. మలేరియా తీవ్రత ఎక్కువగా ఉన్న గ్రామాల్లో ప్రత్యేక నిఘా ఉంచాలని ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లకు సూచించారు. జ్వర బాధితులకు వీలైనంత త్వరగా చికిత్స అందజేయాలన్నారు. అనంతరం రిజిస్టర్లను పక్కాగా నమోదు చేసుకోవాలని ల్యాబ్ టెక్నీషియన్ సురేష్‌కు సూచించారు.

సమష్టి కృషితో అభివృద్ధి సాధ్యం



డీఆర్సీ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి అచ్చెన్నాయుడు పక్కన మంత్రి సంధ్యారాణి, కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

- రెండేళ్లలో అన్ని గ్రామాలకు రహదారి సౌకర్యం
- సంక్రాంతి నాటికి గుంతలు లేని రోడ్లు
- పీహెచ్‌సీలపై ప్రత్యేక దృష్టి
- ప్రతి ఇంటికీ తాగునీరు
- ఐటీడీఏలకు పూర్వ వైభవం
- డీఆర్సీ సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి అచ్చెన్నాయుడు

పార్వతీపురం, డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి): సమష్టి కృషితోనే 'మన్యం' అభివృద్ధి సాధ్యమని జిల్లా ఇన్‌చార్జి మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా సమీక్షా సమావేశం (డీఆర్‌సీ) నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'గిరిజనులు అత్యధికంగా ఉన్న జిల్లాను అభివృద్ధి చేస్తే ఎంతో తృప్తి ఉంటుంది. ప్రజాప్రతినిధులు, అధికారులు పూర్తిస్థాయిలో సహాయ సహకారాలను అందిస్తే అభివృద్ధిని పరుగులు పెట్టిస్తా. జిల్లాకు ప్రత్యేక సమయం కేటాయించి క్షేత్రస్థాయిలో పర్యటిస్తా.. అందరూ మనసు పెట్టి పని చేస్తే కొంత వరకు మార్పు తీసుకురాగలననే నమ్మకం ఉంది. ఈ జిల్లాకు ఇన్‌చార్జి మంత్రిగా నియమించడం అదృష్టంగా భావిస్తున్నా. పదవులు, అధికారం శాశ్వతం కాదు. పదవీ కాలంలో చేసే మంచి పనులే ప్రజల మదిలో నిలిచిపోతాయి. ఇప్పటికీ గిరి శిఖర గ్రామాలకు రహదారులు లేక డోలీ మోతలు తప్పనిసరి కావడం బాధాకరం. రానున్న రెండేళ్లలో జిల్లాలోని అన్ని గ్రామాలకు రహదారుల సౌకర్యం కల్పించడమే ధ్యేయంగా పనిచేస్తున్నాం. దీనికి సంబంధించి ప్రతిపాదనలు పంపిస్తే నిధులు మంజూరు చేస్తాం. 'మన్యం'లో 15 మండలాలకు గాను 37 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, గొప్ప విషయం.వాటిపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తాం. వైద్యులు, సిబ్బంది, మందులు, అంబులెన్స్‌లు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలి. రక్తహీనత నివారణే లక్ష్యంగా పనిచేయాలి. రానున్న ఐదేళ్లలో పీఎం సుజల యోజన పథకం కింద ప్రతి ఇంటికీ తాగునీటి వసతి కల్పిస్తాం. గత వైసీపీ ప్రభుత్వం ఆ పథకాన్ని వినియోగించుకోలేదు. వాటితో పాటు చిన్న నీటి వనరులను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా నిలిచిపోయిన పనులకు ప్రాధాన్యం ఇస్తూ దశల వారీగా పూర్తి చేస్తాం. జిల్లాలో సాగు, తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నారు. జంఝావతి, తోటపల్లి, వంశధార ఇతర నీటి వనరులను పూర్తి స్థాయిలో వినియోగించుకొని మన్యం జిల్లా రాష్ట్రంలోనే ప్రథమస్థానంలో నిలవాలి. జంఝావతి అంతరాష్ట్ర సమస్యను పరిష్కరించుకోగలిగితే ఎత్తిపోతల పథకం సమస్య కొలిక్కి వస్తుంది. పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏలను బలోపేతం చేస్తాం. పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు ఉన్న అవకాశాలను వినియోగించుకోవాలి. జీడిమామిడి, పైనాపిల్ వంటి పండ్ల రసాల తయారు చేసే పరిశ్రమలను స్థాపించాలి. ఇందుకు నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా శిక్షణలు ఇచ్చే విధంగా ఎంఎస్‌ఈలను ప్రోత్సాహించాలి. జిల్లాలో ఉద్యోగులు, సిబ్బంది నియామకాలకు చర్యలు చేపడతాం. సంక్రాంతి నాటికి రహదారులు పరిస్థితి మార్చేందుకు సీఎం చంద్రబాబు రూ.850 కోట్లు మంజూరు చేశారు. గతంలో చంద్రబాబు హయాంలోనే 11 సార్లు డీఎస్సీ ఇచ్చినట్లు గుర్తు చేశారు. ప్రభుత్వం విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తోంది. అంకిత భావంతో ఉద్యోగులు, అధికారులు పనిచేయాలి. జిల్లాలో కొత్త కలెక్టరేట్ భవన నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం.జిల్లాలో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున పొలాల్లో ఉన్న ధాన్యం తడిచిపోకుండా చూడాలి. అవసరమైతే వాటిని మిల్లులకు తరలించాలి. ఏనుగుల కారణంగా పంటలు దెబ్బతినకుండా చర్యలు తీసుకోవాలి. ఉపాధి హామీ పథకం కింద వసతి గృహాల్లో పిచ్చి మొక్కలు తొలగించాలి. ఉద్యాన, మత్స్య సహాయకుల పోస్టులను సంబంధిత శాఖల పరిధిలోకి తీసుకొస్తాం. త్వరలో వెటర్నరీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీచేస్తాం. జిల్లాకు సమీకృత భూసార పరీక్ష, మత్స్యపెంపకం, కేంద్ర సహకార బ్యాంకును మంజూరు చేస్తాం. త్వరలో అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని అమలు చేస్తాం. రూ.140 కోట్లతో ఆధునిక వ్యవసాయ పనిముట్లను పంపిణీ చేస్తాం.' అని తెలిపారు.

అంకితభావంతో పనిచేద్దాం

గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి మాట్లాడుతూ ..' జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు అంకితభావంతో పనిచేద్దాం. గిరిజన ప్రాంతాల్లో రహదారులు, తాగునీటి వసతుల కల్పనకు నిధులు మంజూరు చేశాం. రాష్ట్రంలో ఎక్కడలేని విధంగా గిరిశిఖర గ్రామాల్లో కంటైనర్ ఆసుపత్రులను ఏర్పాటు చేశాం.' అని చెప్పారు. కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ.. ప్రభుత్వ శాఖల్లోని అధికారులు సమన్వయంతో పనిచేసి జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించాలన్నారు. ప్రభుత్వ విప్, కురుపాం, పార్వతీపురం, పాలకొండ ఎమ్మెల్యేలు తోయక జగదీశ్వరి, బోనెల విజయచంద్ర, నిమ్మక జయకృష్ణ, ట్రైకార్ ఛైర్మన్ బి. శ్రీనివాసులు, ఎమ్మెల్సీలు రఘురాజు, విక్రాంత్, ఎస్పీ మాధవరెడ్డి, జేసీ శోభిక, ఐటీడీఏ పీవోలు శ్రీవాత్సవ్, యశ్వంత్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

మున్సిపల్ తాగునీటి సరఫరా కార్మికుల సమ్మె

పార్వతీపురం టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని మున్సిపల్ తాగునీటి సరఫరా విభాగం కార్మికులు సమ్మెలోకి వెళ్లారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. 15 ఏళ్లు పైబడిన కార్మికులను క్రమబద్ధీకరించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ అమలు చేయాలని ఆ సంఘ నాయకులు నినాదాలు చేశారు. 55 ఆదివారాలు, 17 పండగలకు సంబంధించి సెలవులైనా ప్రకటించాలని, లేకుంటే వేతనాలుగానైనా ఇవ్వాలని డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో మృతిచెందిన కార్మికునికి రూ.10 లక్షలు, వైకల్యానికి గురైన వారికి రూ.5 లక్షలు పరిహారం ఇస్తూ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. సీనియారిటీ ప్రాతిపదికన జీతాలు చెల్లించాలని, హెచ్‌ఆర్ పాలసీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని సంఘ సభ్యులు స్పష్టం చేశారు.



నిరసన వ్యక్తం చేస్తున్న తాగునీటి సరఫరా విభాగం కార్మికులు

నారాయణ వనం అసలుందా?

- ఎక్కడి నుంచో వచ్చి ఇక్కడ తిష్ట
- పెద్దల అండతో యథేచ్ఛగా వనం ఆక్రమణ
- ఏకంగా వాణిజ్య పంటల సాగు



అటవీ భూమిని సాగుకు అనుకూలంగా మార్చేసిన వైనం

బొబ్బిలి రూరల్, డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణానికి కూతవేటు దూరంలో ఎన్నో తరాల గ్రామీణులతో ఉన్న అనుబంధం నారాయణ వనం. చెట్టు.. పుట్ట..అనేక రకాల జీవులతో అచ్చంగా అడవిలా ఉండేది. అటవీశాఖ పరిధిలో ఉన్న ఆ భూముల్లో ఎక్కడి నుంచో సమూహాలుగా వచ్చి భూములను ఆక్రమించి తిష్ట వేశారు. వాణిజ్య పంటలను సైతం సాగు చేస్తున్నారు. వారి వెనుక బడాబాబులు ఉన్నట్లు సమాచారం. అక్కడి పరిస్థితిపై గిరిజనులు అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినా స్పందన ఉండడం లేదు. వలసదారుల ఆక్రమణలో ఉన్న నారాయణవనం నేడు రికార్డులకే పరిమితమైంది. బొబ్బిలి మండలంలోని మల్లంపేట, గోపాలరాయుడుపేట, బొడ్డవలస గ్రామీణ ప్రాంతాల ప్రజలతో చిరకాల అనుబంధం ఉండే నారాయణవనంలో వేలాది జీవజాతులు మనుగడ సాగించేవి. అక్కడి చింపికొండ, సూదికొండ, అడ్డుకొండల మధ్య ప్రాంతాన్ని నారాయణ వనం అని పిలుచుకుంటూ నాడు కర్ర పొయ్యిల కోసం అడవిలో ఎండిపోయిన చెట్లకొమ్మలను అతికష్టం మీద తెచ్చుకొనే వారు. ఎలుగుబంట్లు, బౌరుపిల్లులు, నక్కలు వంటి ఎన్నో రకాల జీవజాతులు నివాసం ఉండేవి. నేడు ఏవీ కనిపించడం లేదు. వందలాది ఎకరాల్లో అడవిలోని చెట్లను నరికి పూర్తిగా స్వాధీనం చేసుకున్నారు. ఈ పర్వం ఆగడం లేదు. ఎక్కడినుంచో వచ్చిన వలసదారుల కబ్జాలకు అడవి కుచించుకుపోతోంది. దాదాపు 450 హెక్టార్లలోని అటవీ సంపద ఆవిరైపోయింది. వలసదారుల ఆక్రమణలో దాదాపు 200 ఎకరాలకు పైబడి ఆక్రమణకు గురైంది. ఇంత జరుగుతున్నా అటవీశాఖ అధికారులు నోటీసులతో సరిపుచ్చుకుంటున్నారు. ఉన్నతాధికారులు, బీట్ అధికారులు, వాచర్లు ఏమి చేస్తున్నారన్న ప్రశ్న ఆయా గ్రామాల ప్రజల నుంచి వినిపిస్తోంది. దీనిపై డీఎఫ్‌వో మాట్లాడుతూ.. ఆక్రమణల అంశం తమ దృష్టికి వచ్చిందని, వారికి నోటీసులిచ్చామని తెలిపారు.

సామాజిక పింఛన్ల తనిఖీ

- లబ్ధిదారులను ప్రశ్నించిన అధికారులు

సీతానగరం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సీతానగరం మండలం లచ్చయ్యపేట గ్రామంలో బుధవారం సామాజిక పింఛన్ల తనిఖీ చేపట్టారు. 20 మందితో కూడిన అధికారుల బృందం సాయంత్రం లోగా 40 ఇళ్లలో విచారణ పూర్తి చేశారు. పింఛన్ తీసుకుంటున్న వ్యక్తి బతికి ఉన్నాడా లేదా? ఆదాయం, భూమి, వాహనం, ఉద్యోగం, విద్యుత్ వాడకం, ఇళ్ల స్థలాలు, ఇన్‌కమ్ ట్యాక్స్, ప్రైవేట్ ఉద్యోగం, వితంతువుల భర్తకు సంబంధించి డెత్ సర్టిఫికేట్, దివ్యాంగులకు సదరం ధ్రువపత్రం, వృత్తిదారులకు వృత్తి సర్టిఫికేట్ వంటి పలు అంశాలపై పింఛన్‌దారులను ప్రశ్నించారు. ఈ గ్రామంలో మొత్తంగా 394 పింఛన్లు ఉండగా గురువారం కూడా విచారణ చేపట్టనున్నామని డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి ఎన్.రమేష్ రాయన్ తెలిపారు. ఈ తనిఖీలో ఎంపీడీవో పి.త్రివిక్రమ రావు, పార్వతీపురం, బలిజిపేట, బొబ్బిలి మండలాలకు చెందిన వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. వాస్తవంగా గత వైసీపీ ప్రభుత్వ హయాంలో వలంటీర్లు, ఇతరుల జోక్యంతో అనర్హులు సైతం సామాజిక పింఛన్లు అందాయి. దీనిపై ప్రభుత్వానికి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో పైలెట్ ప్రాజెక్ట్‌గా జిల్లాకు ఒక సచివాలయం పరిధిలో సామాజిక పింఛన్ల పరిశీలనకు ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. దీంతో అధికారులు తొలివిడతగా లచ్చయ్యపేటలో పింఛన్ల తనిఖీ చేపట్టారు.

రెవెన్యూ సదస్సుల్లో.. 49 సేవలు ఉచితం

- యూజర్ చార్జీల మినహాయింపు

6లో

కిరాణాకు గడ్డుకాలం

- ఉమ్మడి జిల్లాలో క్విక్ కామర్స్ జోరు
- ఆన్‌లైన్‌లో వస్తువుల కొనుగోలుకు ప్రజలు మొగ్గు
- మూతపడుతున్న కిరాణా దుకాణాలు

ఆ ఫోన్ కాల్స్‌తో జాగ్రత్త

6లో

- వాటిని ఎత్తొద్దు.. తిరిగి చేయొద్దు
- ఆదమరిచారో ఖాతాలు ఖతమే..
- సైబర్ క్రైం పోలీసుల హెచ్చరిక
- ప్రమాదకర ఫోన్ నెంబర్లు విడుదల



డీలర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ

పార్వతీపురం/పాలకొండ, డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): పార్వతీపురం డివిజన్ పరిధిలో డీలర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసినట్లు సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 36 రేషన్ డిపోలకు శాశ్వత ప్రాతిపదికన డీలర్లను నియమించ నున్నట్లు పేర్కొన్నారు. అర్హతగల వారు ఈనెల 18లోగా పార్వతీపురం సబ్ కలెక్టర్ కార్యాయంలో లేదా సంబంధిత తహసీల్దార్ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. రిజిస్టర్ పోస్టులో కూడా దరఖాస్తులు సమర్పించొచ్చన్నారు. 19న దరఖాస్తుల పరిశీలన, 21న హాల్ టికెట్ల జారీ, 23న పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రాత పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. 26న ఫలితాలు ప్రకటిస్తామని, 28న సబ్ కలెక్టర్ కార్యాలయంలో మౌఖిక పరీక్షను నిర్వహించి 30న తుది ఫలితాలు ప్రకటిస్తామని చెప్పారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై, 18 నుంచి 40 సంవత్సరాలు లోపు వారు అర్హుల న్నారు. స్థానికులై ఉండాలన్నారు. ఆర్థిక స్థోమత వివరాలు తెలుపుతూ స్వీయ డిక్లరేషన్/సర్టిఫికేట్ సమర్పించాలని తెలిపారు. దరఖాస్తుదారుల కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులై ఉండరాదన్నారు. కాగా పాలకొండ డివిజన్ పరిధిలో 21 చౌక ధరల దుకాణాలకు శాశ్వత ప్రాతిపదికన డీలర్ పోస్టులను నియమించనున్నట్లు సబ్ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. భామిని మండలంలో 5, జియ్యమ్మవలస 3, కురుపాం-1, పాలకొండలో 5, వీరఘట్టం మండలంలో 7 డీలర్ పోస్టులు ఉన్నాయని తెలిపారు. అర్హులు గడువులోగా పాలకొండ సబ్ కలెక్టర్ కార్యాలయం, సంబంధిత తహసీల్దార్ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు. 23న పాలకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రాత పరీక్ష, 28న సబ్ కలెక్టర్ కార్యాలయంలో మౌఖిక పరీక్ష ఉంటుందన్నారు.

నిరసనల హోరు

- కలెక్టరేట్ ఎదుట గిరిజనులు, ప్రజా సంఘాల ధర్నా
- సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

బెలగాం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ధర్నాలతో సోమవారం కలెక్టరేట్ దద్దరిల్లింది. నిరసనలతో హోరెత్తింది. తమ సమస్యలు పరిష్కరించాలని గిరిజనులు, ప్రజా సంఘాలు నాయకులు ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. పోడు పట్టాలు ఇవ్వాలని పార్వతీపురం మండలంలోని పలు గ్రామాల గిరిజనులు డిమాండ్ చేశారు. పూర్వీకుల నుంచి సాగు చేసుకుంటున్నా పట్టాలివ్వడం లేదని, దీనిపై అధికారులు స్పందించాలని సీపీఎం ఆధ్వర్యంలో ధర్నాకు దిగారు. ఐటీడీఏ వద్ద గత 20 రోజులుగా దీక్ష చేపడుతున్న గిరిజన గురుకుల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు పెద్దఎత్తున కలెక్టరేట్‌కు చేరుకున్నారు. అయితే కలెక్టర్ కార్యాలయంలో జిల్లా సమీక్షా సమావేశం జరుగుతుండడంతో వారిని పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వారు కలెక్టరేట్ మొయిన్‌గేట్ వద్దే కూర్చొని నిరసన తెలిపారు. డీఎస్సీ నుంచి తమ పోస్టులను మినహాయించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని నినాదాలు చేశారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందించారు.



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న గిరిజనులు, అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు



సీతంపేట రూరల్: మోకాళ్లపై నిల్చుని నిరసన తెలుపుతున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు

సీతంపేట ఐటీడీఏ వద్ద..

సీతంపేట రూరల్: గిరిజన గురుకుల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు సీతంపేట నుంచి ఐటీడీఏ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. స్థానిక బస్‌స్టాండ్ ఆవరణలో మానవహారం చేపట్టారు. అనంతరం మోకాళ్లపై నిలుచుని నిరసన తెలిపారు. సీఆర్‌టీలుగా కన్వర్ట్ చేయాలని, విద్యాహక్కు చట్టం ప్రకారం గిరిజన విద్యార్థులకు విద్యను అందించాలని, సక్రమంగా మెనూను అమలు చేయాలని డిమాండ్ చేశారు. జీవో నెం.3 ప్రత్యామ్నాయంగా కొత్త చట్టం చేయాలని నినదించారు. అనంతరం ఏపీవో జి చిన్నబాబుకు వినతి పత్రాన్ని అందజేశారు. ఏజేఏసీ, గిరిజన సంఘం, సీపీఐ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు , ఉద్యోగులు వారి పోరాటానికి మద్దతు తెలిపారు.

ఉరుకులు.. పరుగులు



రెండు రోజుల్లో వాయుగుండం ఏర్పడనున్నట్టు వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తుండడంతో రైతులు ఉరుకులు పరుగులు పెడుతున్నారు. చేతికి అందివచ్చిన పంటను కాపాడుకునేందుకు కంటి మీద కునుకులేకుండా ప్రయాస పడుతున్నారు. కోసిన చేనును సురక్షిత ప్రాంతానికి తరలించడం, పొలాల్లోనే నూర్పు చేయడం వంటి పనుల్లో బిజీబిజీగా గడుపుతున్నారు. నెల్లిమర్ల మండలంలోని పినతరిమి, రామతీర్థం, గొర్లెపేట, కొత్తపేట తదితర గ్రామాల్లో రైతులు పంటను రక్షించుకునేందుకు యాతన పడడం సోమవారం కనిపించింది.

– నెల్లిమర్ల, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి)

వరి చేను మోపు తెస్తూ..



పొలాల్లోనే వరి పనలు



కోత కోస్తూ..



యంత్రం సాయంతో పొలాల్లోనే నూర్పు చేస్తూ..

కిరాణాకు గడ్డుకాలం

- జిల్లాలో క్విక్ కామర్స్ జోరు
- పల్లెలనూ పాకిన సంస్కృతి
- ఆన్‌లైన్‌లో వస్తువుల కొనుగోలుకు ప్రజలు మొగ్గు
- ఆదరణ కోల్పోతున్న రిటైల్ రంగం
- మూతపడుతున్న కిరాణా దుకాణాలు



కొనుగోలుదారులు లేక తోటపాలెంలో ఖాళీగా ఉన్న కిరాణా షాప్

● దత్తిరాజేరు మండలం పెద్దమానాపురంలో జరిగే సంతలో గుండు సూది నుంచి గునపాం వరకూ.. ఉల్లిపాయల నుంచి వంట నూనెల వరకూ ఏ వస్తువు కావాలన్న ఇట్టే దొరుకుతుంది. ప్రతి శనివారం జరిగే ఈ సంతకు గతంలో వేలాది మంది కొనుగోలుదారులు వచ్చేవారు. ప్రస్తుతం వారి సంఖ్య భారీగా తగ్గింది. దీనికి కారణం క్విక్ కామర్స్. ఆన్‌లైన్‌లో ఆర్డర్ ఇచ్చిన గంటల వ్యవధిలోనే వస్తువులు ఇంటికి చేరిపోతున్నాయి.

● రాంబాబు అనే ఉపాధ్యాయుడు పాఠశాల నుంచి వచ్చిన వెంటనే మార్కెట్‌కు వెళ్లి ఇంటికి అవసరమైన సామగ్రి తెచ్చుకోవడం అలవాటు. ఇటీవల స్నేహితుడి సూచనతో జియో మార్టు యాప్‌ను ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసుకున్నాడు. బయట మార్కెట్ కంటే తక్కువ ధరకు నిత్యావసరాలు ఉండడంతో ఒకేసారి ఇంటికి అవసరమైన సామగ్రిని యాప్‌లో బుక్ చేసుకుంటున్నారు. దీంతో అటు ధర, ఇటు సమయం ఆదా అవుతోందని చెబుతున్నాడు.

● విజయనగరానికి చెందిన అపర్ణ అనే మహిళ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటారు. పైగా బ్యూటీషియన్. దీంతో ఆమెకు మహిళల పరిచయం ఎక్కువ. ఈ తరుణంలో ఆమె 1000 మంది మహిళలతో వాట్సాప్ గ్రూప్‌ను క్రియేట్ చేశారు. మార్కెట్‌లోకి వచ్చే దుస్తులు, వన్‌గ్రామ్ గోల్డ్, మేకప్‌కు సంబంధించి సామగ్రి వివరాలను గ్రూప్‌లో షేర్ చేస్తుంటారు. ఇష్టం వచ్చిన వారు చెబితే ఆర్డర్ పెడతానని చెబుతుంటారు. అదో వ్యాపారంగా మలుచుకున్నారు.

● పవన్, గౌతమిలు దంపతులు. ఇద్దరూ ప్రైవేటు ఉద్యోగులే. సాయంత్రం 6 గంటల తరువాతే ఇంటికి చేరుతుంటారు. రోజంతా పనితో శ్రమపడే వీరు రాత్రి ఇంటివద్దకు వచ్చేసరికి అలసటకు లోనవుతున్నారు. వంట చేసే ఓపిక లేక స్విగ్గీ ద్వారా ఆన్‌లైన్‌లో నచ్చిన ఆహారాన్ని ఆర్డర్ చేస్తున్నారు. గంట వ్యవధిలోనే నచ్చిన ఆహారం ఇట్టే ఇంటికి చేరిపోతుంది.

విజయనగరం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో క్విక్ కామర్స్ సంస్కృతి శరవేగంగా విస్తరిస్తోంది. చాలామంది ఆన్‌లైన్‌లో తమకు నచ్చిన, మెచ్చిన వస్తువులు, ఆహారం, ఇతరత్రా సామగ్రిని ఆర్డర్ చేస్తున్నారు. క్షణాల్లో అవి ఇంటికి చేరుతున్నాయి. నగరాల్లో ఉండే ఈ సంస్కృతి క్రమేపీ పట్టణాలకు వ్యాపించింది. ఇప్పుడు గ్రామీణ ప్రాంతాలకు విస్తరించింది. ఈ రంగంలోకి పేరుమోసిన సంస్థలు ప్రవేశిస్తున్నాయి. మన జిల్లాకు సంబంధించి విజయనగరంలో ఎక్కువగా ఆన్‌లైన్ వ్యాపార లావాదేవీలు జరిగేవి. విశాఖకు కూతవేటు దూరంలో ఉండడంతో నగరీకరణ ఎక్కువగా కనిపించేది. బయట మార్కెట్‌లో కంటే ఆన్‌లైన్‌లో ధరలు తక్కువగా ఉండడంతో పాటు పాటు సమయం ఆదా అవుతుండడంతో క్విక్ కామర్స్‌ను ఎక్కువమంది ఆశ్రయిస్తున్నారు. అయితే, దీనివల్ల కిరాణా దుకాణాల్లో వ్యాపారాలు పడిపోయాయి.

మూతపడుతున్న దుకాణాలు..

క్విక్ కామర్స్‌తో కిరాణా దుకాణాలు గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటున్నాయి. గతంలో కిరాణా దుకాణాలకు ఎంతో ఆదరణ ఉండేది. ప్రతి పట్టణం, పల్లెల్లో పేరుమోసిన కిరాణా దుకాణాలు నడిచేవి. చాలామంది ఇతర వ్యాపారాలు చేసేవారు సైతం చివరకు కిరాణా దుకాణాల వైపు మొగ్గుచూపేవారు. అయితే దేశంలో క్విక్‌కామర్స్ దెబ్బకు పెద్ద ఎత్తున కిరాణా దుకాణాలు మూతపడుతున్నాయి. గత ఏడాదిలో దేశ వ్యాప్తంగా 2 లక్షల కిరాణా దుకాణాలు మూతపడినట్టు జాతీయ వాణిజ్య సంస్థ స్పష్టం చేసింది. క్విక్ కామర్స్ రంగం పెరగడానికి అనేక కారణాలు ఉన్నాయి. మనిషి దైనందిన జీవితం బిజీగా మారడం. ప్రభుత్వ ఉద్యోగాలు కంటే ప్రైవేటు ఉద్యోగాలే ఇప్పుడు అధికంగా ఉన్నాయి. ప్రైవేటు సెక్టారు అంటే ఉరుకులు, పరుగులు పెట్టాల్సి ఉంటుంది. అదే సమయంలో భర్తతో పాటు భార్య పనిచేయాల్సి ఉంటుంది. అటువంటి వారు ఇంటి అవసరాల కోసం తమ సమయాన్ని కేటాయించే పరిస్థితి ఉండదు. అందుకే వారు ఎక్కువగా క్విక్ కామర్స్ సంస్థలను ఆశ్రయిస్తున్నారు.

రాబోయే రోజులు వాటివే..

క్విక్ కామర్స్ సంస్థల మధ్య పోటీ ఉన్న తరుణంలో చాలా రకాల రాయితీలు ప్రకటిస్తున్నాయి. నాణ్యతకు పెద్దపీట వేస్తున్నాయి. సత్వర సేవలను ప్రోత్సహిస్తున్నాయి. దీని మూలంగానే ఇండియన్ రిటైల్ రంగంలో కిరాణా దుకాణాలతో పాటు ప్రజలకు అవసరమైన వస్తువులు విక్రయించే షాపుల సంఖ్య గణనీయంగా తగ్గుముఖం పడుతుందని జాతీయ సంస్థలు అంచనాలను వెల్లడిస్తున్నాయి. రాబోయే ఐదేళ్లలో క్విక్ కామర్స్ సంస్థలు 1500 శాతం వృద్ధి సాధిస్తాయని చెబుతున్నాయి. అంటే ఏడాదికేడాది 300 శాతం తమ సేవలను విస్తరిస్తాయన్న మాట. అటు ప్రభుత్వానికి సైతం పన్నుల రూపంలో ఆదాయం పెరిగే అవకాశం ఉంది. రాబోయే రెండు, మూడు సంవత్సరాల్లో ప్రభుత్వానికి 300 నుంచి 400 మిలియన్ల ఆదాయం సమకూరుతుందని కూడా వాణిజ్య నిపుణులు చెబుతున్నారు. ఈ రంగంలో ఉద్యోగుల సంఖ్య కూడా పెరిగే అవకాశం ఉంది. ఇప్పటివరకూ ఈ సంస్థల్లో సగటు ఉద్యోగికి రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకూ జీతం ఉండేది. ఇప్పుడు రూ.25 వేలకు పెరిగే అవకాశాలు కూడా ఉన్నాయి. భారతీయ రైల్వే కంటే ఈ రంగంలో ఉద్యోగాల భర్తీ పెరుగుతుందని తెలుస్తోంది.

ఆదరణ పెరుగుతోంది..

విజయనగరంలో క్విక్ కామర్స్‌కు ఎనలేని ఆదరణ ఉంది. పల్లెలకు సైతం విస్తరిస్తోంది. ఆర్డర్లు మీద ఆర్డర్లు వస్తున్నాయి. మధ్యతరగతి ప్రజలు సైతం ఆసక్తి చూపుతున్నారు. ఒక్క విజయనగరం సిటీలోనే కాకుండా పరిసర ప్రాంతాల్లో సైతం ఆన్‌లైన్ సేవలు పెరుగుతున్నాయి.

-సురేష్, జుమాటో ప్రతినిధి, విజయనగరం

అన్నింటా ఆదా..

సమయంతో పాటు డబ్బులు ఆదా అవుతున్నాయి. క్విక్ కామర్స్ సంస్థలు నాణ్యతకు పెద్దపీట వేస్తున్నాయి. ఇంటికి వెళ్లేటప్పటికి అవసరమైన నిత్యవసరాలతో పాటు ఆహారం కూడా ఇట్టే చేరిపోతుంది. ముఖ్యంగా దంపతులిద్దరూ ఉద్యోగాలు చేస్తే వారికి క్విక్ కామర్స్ సంస్థలే కుటుంబ సభ్యుల వలే అండగా నిలుస్తాయి.

-చరణ్ స్థానికుడు, విజయనగరం

మా కొంపముంచింది..

ఎన్నో ఏళ్లుగా కిరాణా షాపును నడుపుతున్నా. చిన్నపాటి వ్యాపారంతో కుటుంబాన్ని పోషిస్తూ జీవనం సాగిస్తున్నాం. దానిద్వారా వచ్చే ఆదాయంతో ఇంటి, షాపు అద్దె కడుతున్నాం. పిల్లల చదువులను కొనసాగిస్తున్నాం. క్విక్ కామర్స్, ఆన్‌లైన్ వ్యాపారం వచ్చిన తరువాత తీవ్ర నష్టాలను చవిచూస్తున్నాం. ఒకప్పుడు రోజుకు రూ.20 వేల వరు వ్యాపారం సాగేది. ఇప్పుడది సగానికి పడిపోయింది. దీంతో మార్జిన్ కూడా తగ్గిపోయింది. వ్యాపారం మూతపడే అవకాశం ఉంది.

-కె.రవికుమార్, విజయనగరం, కోట రోడ్డు

మూసివేసే పరిస్థితి..

గత 50 ఏళ్ల నుంచి మా తల్లిదండ్రులు కిరాణా షాపు నడుపుతూ మమ్మల్ని పోషించి, చదివించారు. ఇప్పుడు నేను, నా భార్య ఇదే కిరాణా షాపును నమ్ముకుని జీవిస్తున్నాం. ఆన్‌లైన్, క్విక్ కామర్స్ సంస్థలు మార్కెట్‌లోకి వచ్చిన తరువాత మా వ్యాపారం బాగా తగ్గింది. ఇది వరకు కందిపప్పు, పెసర పప్పు, సుగర్ తదితర వస్తువులు కేజీల్లో అమ్ముడయ్యేవి. ఇప్పుడు పావు కేజీల్లో కొనుగోలు చేస్తున్నారు. ఎక్కువ మొత్తంలో ఆన్‌లైన్ ద్వారా కొనుగోలు చేయడంతో మా వ్యాపారం సగానికి పైగా పడిపోయింది.

-కొప్పాక సత్యనారాయణ, విజయనగరం తోటపాలెం





రెవెన్యూ సదస్సుల్లో.. 49 సేవలు ఉచితం

● యూజర్ చార్జీల మినహాయింపు

గరుగుబిల్లి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల్లో ప్రజలు అందించే వినతులకు 49 రకాల సేవలు ఉచితంగా అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వీటన్నింటికీ యూజర్ చార్జీలను మినహాయిస్తూ ఆదేశాలు జారీ చేసింది.

రెవెన్యూ శాఖ ద్వారా..

కంప్యూటర్ అడంగల్ సర్వే, ఎల్‌పీ నెంబరు, డూప్లికేట్ ఈబీసీ, సమీకృత, ఓబీసీ ధ్రువపత్రాలను రుసుం లేకుండా ఇస్తారు. అలాగే పట్టాదార్ పాస్ పుస్తకం కమ్ టైటిల్ డీడ్, రెండోసారి జారీ చేసే ఆదాయ, ఇంటిగ్రేటెడ్ ధ్రువపత్రాలు, ఆర్‌వోఆర్ 1బీ, నీటి పన్ను, వ్యవసాయ భూమి విలువ, పేరు మార్పు, ఏపీ చుక్కల భూముల చట్టం కింద క్లెయిమ్స్, పాత ఈ-పాస్ బుక్ స్థానంలో కొత్తది, డీ-పట్టా, ఇంటి స్థలం పట్టా, కుటుంబ సభ్యుని ధ్రువపత్రం, ఆదాయ, ఈడబ్ల్యూఎస్ వర్గాలవారికి జారీ చేసే ఆదాయ, ఆస్తి పత్రం, ఇనాం భూములపై ఆక్యుపెన్సీ హక్కు, చిన్న, సన్నకారు రైతుగా నిర్ధారణ, జీవో నెంబరు 225 ప్రకారం భూ కేటాయింపు, ఆలస్యంగా జనన, మరణ ధ్రువపత్రాల నమోదు, మాన్యువల్ అడంగల్, పట్టాదారు ఆధార్ సీడింగ్ ఎల్‌పీ నెంబరు, చరవాణి నంబరు పట్టాదారు ఆధార్ సీడింగ్, 22ఏ-1ఏ, 1బీ, 1డీ, 1ఈలో మార్పులు, చేర్పులు, మ్యూటేషన్‌కు సంబంధించి తప్పొప్పుల సవరణ, నో ఎర్నింగ్, నో ప్రాపర్టీ, పొజిషన్, స్థానికత, రీసెటిల్‌మెంట్ రిజిస్టర్, టైటిల్ డీడ్ కమ్ పాస్‌బుక్, తదితర సేవలు అందజేస్తారు.

సర్వే శాఖ నుంచి..

ఎఫ్‌ఎంబీ కాపీ, ఎఫ్-లైన్ దరఖాస్తు, పట్టా సబ్ డివిజన్, పట్టా మ్యూటేషన్, ఆటో మ్యూటేషన్‌కు పట్టా సబ్ డివిజన్, గ్రామ పటం కాపీ, తదితర సేవలను ఈ శాఖ ద్వారా పొందవచ్చని జిల్లా అధికారులు ప్రకటించారు.

ఆ ఫోన్ కాల్స్‌తో జాగ్రత్త



- వాటిని ఎత్తొద్దు.. తిరిగి చేయొద్దు
- ఆదమరిచారో ఖాతాలు ఖతమే
- సైబర్ క్రైం పోలీసుల హెచ్చరిక
- ప్రమాదకర ఫోన్ నెంబర్లు విడుదల

గరుగుబిల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి)

మిస్డ్ కాల్ వచ్చిందని.. తిరిగి ఆ నంబర్‌కు కాల్ చేస్తున్నారా? అయితే మీరు డేంజర్‌లో పడిపో యినట్లే. అలా చేసిన జస్ట్ మూడు సెకన్లలో హ్యాక్ చేసి మీ ఫోన్‌కు అనుసంధానమైన ఖాతా వివరాలు, కాంటాక్ట్స్‌ను కొట్టేస్తున్నారని సైబర్ క్రైం పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఫిర్యాదులు, ప్రాథమిక విచారణలో తేలిన అంశాలతో గుర్తించిన కొన్ని అనుమానిత +కోడ్‌తో వచ్చే ఫోన్ నెంబర్లను విడుదల చేశారు.

90 లేదా # 09 కూడా..

ఎవరైనా గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి #90 లేదా #09కు డయల్ చేయమంటే చేయొద్దని, అలా చేస్తే మీ సిమ్‌ను వాళ్లు యాక్టివేట్ చేసుకుని మీ నంబర్‌తో నేరాలకు పాల్పడి మిమ్మల్ని ఇరికిస్తారని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఇలాంటి ఫోన్ నెంబర్ల సమాచారాన్ని కుటుంబ సభ్యులతో పాటు తెలిసిన వారికి చెప్పి అప్రమత్తం చేయాలని సూచిస్తున్నారు.

ఈ కోడ్‌లతో వచ్చే నెంబర్లతో జాగ్రత్త..

- +375 (బేలారస్)
- +371 (లాటివ)
- +381 (సెర్బియా)
- +563 (వలపరైసో)
- +370 (విలనియస్)
- +255 (టాంజానియా)

అస్సలు ఎత్తకూడని నెంబర్లు..

- +94777455913
- +37127913091
- +37178565072
- +56322553736
- +3705222959
- +255901130460

అప్రమత్తంగా ఉండాలి..

సైబర్ మోసగాళ్ల వలలో పడకుండా ప్రజలను చైతన్యపరుస్తున్నాం. జిల్లాలో పలువురు సైబర్ మోసాల బారినపడ్డారు. ఎస్పీ మాధవరెడ్డి ఆదేశాల మేరకు ప్రజలకు ప్రత్యేక అవగాహన కల్పిస్తున్నాం. ప్రమాదకర ఫోన్ నెంబర్లు విని యోగించకుండా అప్రమత్తం చేస్తున్నాం. +కోడ్‌తో వచ్చే నెంబర్లతో అప్రమత్తంగా ఉండాలి. సిమ్‌లతో మోసానికి పాల్పడతారు. పోలీసుల సూచనలను పాటిస్తే సైబర్ మోసాలు తగ్గుతాయి. మోసగాళ్ల వలలో పడకుండా అప్రమత్తంగా వ్యవహరించి పోలీసులకు సహకరించాలి.

-ఎం.రాంబాబు, ఎస్‌డీపీవో, పాలకొండ

ఇలా సేకరణ.. అలా చెల్లింపు!

- గంటల వ్యవధిలోనే ధాన్యం డబ్బులు జమ
- ఆనందంలో అన్నదాత

మెంటాడ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు చేసిన వారంలోపే రైతుల ఖాతాల్లో డబ్బులు జమచేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం, 24 నుంచి 48 గంటల్లోపే చెల్లింపులు జరపడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత వైసీపీ పాలనలో బిల్లుల కోసం రైతులు నెలల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉండేది. ధాన్యం డబ్బుల కోసం రైతన్నలు రోడెక్కిన సందర్భాలు అనేకం. సమయానికి సర్దుబాటు కాకపోవడం, అవసరాలు తీర్చుకోవడానికి, పంట పెట్టుబడి నిమిత్తం వాడిన అప్పులు తీర్చేందుకు అప్పులు చేయాల్సిన పరిస్థితి ఉండేది. దుస్థితి. దీంతో ప్రైవేటు వ్యాపారాల వైపు మొగ్గుచూపేవారు. ఇదే అదనుగా వారు రకరకాల కొర్రీలతో రైతులను ఇబ్బంది పెట్టేవారు. ఇంతచేసినా సకాలంలో డబ్బులు చెల్లించక రైతుల పరిస్థితి రెండింటికీ చెడ్డ రేవడిలావారి పరిస్థితి ఉండేది.

48 గంటల్లోపే..

ఈ నేపథ్యంలో వారంలోపే చెల్లింపులు అని ముఖ్యమంత్రి చంద్రబాబుతోపాటు మంత్రులు పదేపది ప్రకటించినా.. గత ప్రభుత్వ హయాంలోని చేదు అనుభవాల దృష్ట్యా రైతులు మొదట్లో నమ్మలేదు. 48గంటల్లోపే చెల్లింపులు జరుగుతుండడంతో రైతుల ఆనందానికి అవధుల్లేవు. విషయం అందరికీ తెలియడంతో మెజారిటీ రైతులు ఆర్బీకేలవైపు చూస్తున్నారు. ఆర్బీకే సిబ్బంది కూడా రైతులకు ఇబ్బంది కలగకుండా చురుగ్గా పనిచేస్తున్నారు. దీంతో ధాన్యం సేకరణ శాతం గతం కంటే పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నాయి. ఇదిలావుంటే ఇప్పటికీ కొన్నిచోట్ల ప్రైవేటు వ్యాపారులు తమ స్వార్థం కోసం, చెల్లింపులు ఆలస్యమవుతున్నట్టు ప్రభుత్వ వ్యతిరేక ప్రచారానికి దిగుతున్నారు. పెట్టుబడి అప్పులు వాడిన రైతులు గత్యంతరం లేని పరిస్థితుల్లో వారివద్దకు ధాన్యాన్ని తీసుకెళ్తే, తేమశాతం, నాసిరకం, పొల్లు గింజలు తదితర కొర్రీలు వేస్తూ క్వింటాలుకు నాలుగైదు కిలోలు అదనంగా తీసుకుంటున్నారు. ధర విషయంలోనూ మోసం చేస్తున్నారని బాధిత రైతులు ఆవేదన చెందుతున్నారు. మిల్లుల యజమానులు రైతులు నుంచి క్వింటాకు ఐదు నుంచి ఎనిమిది కిలోల వరకు అదనంగా వసూలు చేస్తున్నారని రైతులు గగ్గోలు పెడుతున్నారు. అదనపు ధాన్యం ఎందుకు ఇవ్వాలని ప్రశ్నిస్తే.. లేనిపోని కొర్రీలు వేసి ధాన్యం తీసుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. ఏది ఏమైనా గంటల వ్యవధిలోనే డబ్బులు జమ అవుతుండడంతో అన్నదాతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ విధానాన్ని ఇలా కొనసాగించడం ద్వారా దళారీ వ్యవస్థకు చెక్ పెట్టవచ్చుననే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



మిల్లులకు ధాన్యం తరలిస్తున్న రైతులు

ఇబ్బంది పడేవాళ్లం

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ధాన్యం డబ్బుల కోసం చాలా ఇబ్బంది పడేవాళ్లం. నెలల తరబడి వేచిచూడాల్సి వచ్చేంది. దీంతో ఎన్నో బాధలు పడేవాళ్ళం. ప్రైవేటు వ్యాపారులకు ఇచ్చుకున్నా బావుండేది అనిపించేది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వారంలో వేస్తామని చెప్పి రెండు రోజుల్లోపే వేసేస్తున్నారు. ప్రభుత్వం అంటే ఇలా ఉండాలి.

- రెడ్డి చంద్రరావు రైతు, పిట్టాడ గ్రామం

చంద్రబాబుకు ధన్యవాదాలు

ధాన్యం ఇచ్చిన రెండు రోజులలోపే డబ్బులు ఖాతాల్లో జమవుతుండడం నమ్మలేకపోతున్నాం. గత ప్రభుత్వ హయాంలో రెండు నెలలు పనే పట్టేది. దీంతో చాలా ఇబ్బంది పడేవాళ్లం. దీంతో దళారీలే దిక్కయ్యేవారు. ఇప్పుడా బాధ లేదు. సంతోషంగా ఉంది. చంద్రబాబు ప్రభుత్వానికి ధన్యవాదాలు.

- సిరిపురం రామకృష్ణ రైతు, పిట్టాడ గ్రామం

న్యూస్ బాక్స్

నేడు నీటి సరఫరా బంద్

రాజాం/రాజాం రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘ పరిధిలోని బొబ్బిలి రోడ్డులో కొన్ని ప్రాంతాలకు మంగళవారం తాగునీటి సరఫరాలో అంతరాయం కలుగుతుందని కమిషనర్ జె.రామప్పలనాయుడు, ఏఈ వెంకట్ ఒక ప్రకటనలో తెలిపారు. బొబ్బిలి రోడ్డులో పైప్‌లైన్ మరమ్మతుల కారణంగా అమ్మవారికాలనీ, మెంతిపేట ఎస్సీ కాలనీ, మాదిగ వీధి. మెంతిపేట కాలనీ, వస్త్రపురి కాలనీ. మల్లయ్యపేట, బొబ్బిలి రోడ్డు, కాలెపువీధి. చెగుడువీధి, లచ్చయ్యపేట, మేదర వీధి, కంచరవీధి ప్రాంతాలకు తాగునీటి సరఫరా ఉండదని వెల్లడించారు.

16 నుంచి ధనుర్మాస పూజలు

రాజాం రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాణావీధిలోని రాజగోపాలస్వామి ఆలయంలో ఈ నెల 16 నుంచి జనవరి 13 వరకు ధనుర్మాస పూజలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు సోమవారం తెలిపారు. జనవరి 10న ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉత్తరద్వార దర్శనం కల్పించనున్నట్లు వివరించారు. 11న కుడారి ఉత్సవం, 13న గోదా కల్యాణం నిర్వహిస్తారని వివరించారు.

అక్రమ రవాణాకు అడ్డుకట్ట

విజయనగరం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పీడీఎస్ బియ్యం అక్రమ రవాణకు జిల్లా యంత్రాంగం అడ్డుకట్ట వేస్తుందని సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్ మీనాకుమారి ఓ ప్రకటనలతో తెలిపారు. ఈమేరకు తహసీల్దారులు, డిప్యూటీ తహసీల్దారులు, ఆర్ఐలతో నిరంతరం సోదాలు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ నెల 8న 'ఆంధ్రజ్యోతి'లో 'బియ్యం మాఫియా' శీర్షికతో వచ్చిన కథనంపై ఆమె స్పందించారు. వివిధ ప్రాంతాల్లో తనిఖీలు చేసి. కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

ఆక్రమణపై ఫిర్యాదు

గజపతినగరం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మదుపాడ రెవెన్యూ పరిదిలోగల సాగునీటి కాలువ ఆక్రమణలకు గురవుతోందని, తక్షణమే అదికారులు చర్యలు తీసుకోవాలని సర్పంచ్ కె.పైడిపినాయుడు సోమవారం తహసీల్దార్ బి.రత్నకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగునీరు వస్తున్న కాలువలను రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించుకొని కట్టడాలు చేపడుతున్నారని తెలిపారు. దీంతో మదుపాడ, గజపతినగరం పంచాయితీలకు సంబంధించి ఆయకట్టుదారులు తీవ్ర ఇబ్బందులకు గురికావలసి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆక్రమణలను నిరోధించాలని కోరారు.

పరిష్కారం చూపండి

విజయనగరం రింగురోడ్డు, డిసెంబరు 9: (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చిన వినతులను తక్షణమే పరిష్కరించాలని నగర పాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య ఆదేశించారు. సోమవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించి వినతులను ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డాక్టరు కొండపల్లి సాంబమూర్తి, అసిస్టెంట్ సిటీ ప్లానర్ హరిబాబు, ఈఈ టి.రాయల్‌బాబు, రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రయోజనం శూన్యం

చీపురుపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 7న నిర్వహించిన మెగా పేరెంట్స్ డే వల్ల ఎటువంటి ప్రయోజనం కలగక పోగా, విద్యార్థులు, వారి తలిదండ్రులకు నష్టం జరిగిందని వైసీపీ నాయకులు ఆరోపించారు. ఈ మేరకు సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, పతివాడ రాజారావు, కె.దాలయ్య తదితరులు మాట్లాడారు. ఈ నెల 10 నుంచి అన్ని పాఠశాలల్లో అర్ధ సంవత్సర పరీక్షలు జరగాల్సి ఉన్నాయన్నారు. ఈ పరిస్థితుల్లో మెగా పేరెంట్స్ డే పేరుతో వారిని ప్రభుత్వం ఇబ్బంది పెట్టిందన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన

భోగాపురం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వెంకటేష్ అన్నారు. సుందరపేట సామాజిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం హెచ్‌ఐవీపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసీటీసీ సెంటర్ మెడికల్ అధికారి డా.శాలిని, వైద్యులు సునీల్, గౌతమ్, స్వాతి, కౌన్సిలర్ పుష్పారావు తదిరతులు పాల్గొన్నారు.

పక్కాగా ఎన్నికలు

బొండపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 14న మండలంలో గల చిన్న, మధ్యతరహా సాగునీటి సంఘాలకు ఎన్నికలను పక్కాగా నిర్వహించాలని తహసీల్దార్ రాజేశ్వరరావు సూచించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం ఎన్నికల సిబ్బందికి శిక్షణ ఇచ్చారు.

పోలీసు స్టేషన్ సందర్శన

గుర్ల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): యువత క్రమశిక్షణతో ఉండాలని చీపురుపల్లి డీఎస్పీ రాఘవులు అన్నారు. సోమవారం స్థానిక పోలీసు స్టేషన్‌ను ఆయన సందర్శించారు. పరిసరాలను పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు. పోలీసు సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నారు.

నిరుద్యోగ సమస్య పరిష్కారమే ధ్యేయం



నిరుద్యోగులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళా వెంకటరావు

గరివిడి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పూర్తిగా నిరుద్యోగ సమస్య పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు అన్నారు. గరివిడిలోని ఒక ప్రైవేటు ఫంక్షన్ హాలులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో సోమవారం మెగా జాబ్ మేళా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కళా మాట్లాడుతూ గత ప్రభుత్వ వికృత చేష్టల వల్ల రాష్ట్రంలోకి నూతన పరిశ్రమలు రాలేదన్నారు. ప్రభుత్వం కూడా ఉద్యోగాలు భర్తీ చేయలదేన్నారు. అందువల్లనే రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య పెరిగిపోయిందన్నారు. దీనిని తీవ్రంగా పరిగణించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కొత్త పరిశ్రమల ఏర్పాటుకు... నిరుద్యోగ సమస్య పరిష్కారానికి ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ఈ జాబ్ మేళాలో నియోజకవర్గంలో 950 మంది యువత ఉద్యోగాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకోగా... 350 మందికి ఉద్యోగ అవకాశం లభించిందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్ మల్లిక్ నాయుడు, నాయకులు కె.త్రిమూర్తులురాజు, పైల బలరాం, ఎస్.సురేష్‌కుమార్, బలగం వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం కంటే గొప్పది లేదు


అన్నప్రసాద వితరణను ప్రారంభిస్తున్న అశోక్ గజపతిరాజు

విజయనగరం రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అన్నప్రసాద వితరణ అనేది గొప్ప విషయమని కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు చెప్పారు. సోమవారం నగరంలోని గాజులరేగ సింహద్వారం వద్ద ఉన్న ఈశ్వర, సాయిబాబా ఆలయం వద్ద ఆలయ కమిటీ చైర్మన్ నడిపిల్లి రవికుమార్ ఆధ్వర్యంలో జరిగిన భారీ అన్నసమారాధనను ఆయన ప్రారంభించారు. అన్నప్రసాద వితరణ బృహత్తరమైనదన్నారు. ఈ ఆలయం వద్ద గత 24 ఏళ్లుగా క్రమం తప్పకుండా అన్నదానం నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆల్తి బంగారు బాబు, పత్తిగిల్లి సూర్యకుమారి, కర్రోతు రాధామణి, కర్రోతు నర్సింగరావు, గడి శ్రీను పాల్గొన్నారు.

వినతులను వెంటనే పరిష్కరించాలి:కలెక్టర్


సమస్యలు వింటున్న కలెక్టర్ అంబేడ్కర్

విజయనగరం కలెక్టరేట్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం జిల్లాలో జరుగుతున్న రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ అంబేడ్కర్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి రోజు సాయంత్రానికి ఎన్ని దరఖాస్తులు అందాయి? ఎన్ని పరిష్కరించారో? అనేది నివేదిక ఇవ్వాలని సూచించారు. ప్రజా వినతుల పరిష్కార వేదికకు వచ్చే వినతులను లాగిన్‌లో అధికారులు ఎప్పటికప్పుడు చూడాలన్నారు. 'ఇంకనూ చూడవల్సిన' కాలంలో ఎప్పుడు చూసినా సున్నా కనపడాలని చెప్పారు. రీ ఓపెన్ కేసులు ఉండకూడదని చెప్పారు. హైకోర్టు, జిల్లా కోర్టులలో నమోదైన కేసులను సంబంధిత వెబ్‌సైట్‌టులో రోజూ తనిఖీ చేయాలని చెప్పారు.

94 వినతులు

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వివిధ సమస్యలపై 94 వినతులు వచ్చాయి. వీటిని కలెక్టర్ అంబేడ్కర్, జేసీ సేతుమాధవన్, డీఆర్‌వో శ్రీనివాసమూర్తి స్వీకరించారు. భూములకు సంబంధించి 43 వినతులు, పంచాయతీరాజ్‌కు 10, పింఛన్లకు 25, మున్సిపాల్టీకి 6, విద్యాశాఖకు 6, వైద్య శాఖకు 3, విద్యుత్ శాఖకు ఒక వినతి వచ్చింది. జిల్లాలో పని చేస్తున్న టీవీ మెకానిక్‌లకు స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా శిక్షణ ఇప్పించాలని యూనియన్ నాయకులు రౌతు శ్రీనివాసరావు వినతిపత్రం అందించారు. విద్యా హక్కుచట్టం 2009 జిల్లాలో సక్రమంగా అమలు జరగలేదని, ప్రభుత్వం ఫీజులు చెల్లించాలని ఉత్తరాంధ్ర అంబేడ్కర్ నాయకులు పి.వెంకటరమణ కోరారు.

ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజల్లోకి:బొత్స


మాట్లాడుతున్న బొత్స సత్యనారాయణ తదితరులు

విజయనగరం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో విద్యుత్ చార్జీల పెంపు, ధాన్యం కొనుగోలు వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్తామని ఎమ్మెల్సీ బొత్స సత్యానారాయణ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో వైసీపీ మాజీ శాసన సభ్యులు, నేతలతో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం హామీల అమలులో విఫలమైందని ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌లో ప్రభుత్వం విఫమైందని ఆరోపించారు. డిసెంబరులో విద్యుత్ చార్జీలు పెంచారని, జనవరి నుంచి మళ్లీ పెంచకుండా ఉంటే ప్రభుత్వం ముందు తలదించుతానని అన్నారు. వైసీపీ నేతలు భూ కబ్జాలకు పాల్పడినట్లు భావిస్తే విచారణ చేపట్టి ఎటువంటి చర్యలైనా తీసుకోవచ్చన్నారు. రైతుల సమస్యలపై ఈ నెల 13న కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తామన్నారు. 27న విద్యుత్ చార్జీల పెంపుపై అధికారులను కలిసి వినతిపత్రాలు అందచేస్తామన్నారు. జనవరి 3న విద్యార్థుల సమస్యలపై కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తామన్నారు. త్వరలో జిల్లా పార్టీ కమిటీలు, జిల్లా, నియోజవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులను ప్రకటిస్తామన్నారు. ఈ సమావేంలో వైసీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

పెద్దచెరువు వద్ద విద్యుత్ సౌకర్యం

విజయనగరం రింగురోడ్డు, డిసెంబరు 9: (ఆంధ్రజ్యోతి): నగరంలోని పెద్దచెరువునకు ఆనుకొని ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్ ప్రాంతంలో విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. వాటి నిర్వహణను సోమవారం ఏఈ స్రవంతి పరిశీలించారు. వాకింగ్ ట్రాక్ వద్ద విద్యుత్ దీపాలు లేకపోవడంతో చెత్తాచెదారాలు వేస్తూ, నిరుపయోగంగా తయారు చేస్తున్న విషయాన్ని నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య ఇటీవల గుర్తించారు. తక్షణమే ఆ ప్రాంతంలో విద్యుత్ దీపాలు అమర్చాలని ఇంజనీరింగు సిబ్బందిని ఆదేశించారు. ఆయన ఆదేశాలతో సిబ్బంది విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. ఇదిలా ఉండగా.. నగరంలో సోమవారం ఆచంట గార్డెన్స్ వద్ద ఉన్న గ్రిల్స్‌కు, గోడలకు వివిధ రకాల పెయింటింగ్‌లను నగర పాలక సంస్థ సిబ్బంది వేస్తున్నారు.

కమిషనర్‌ను కలిసిన ఆడిట్ అధికారులు

నగర పాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ఆడిట్ నిర్వహణపై సంబంధిత అధికారులు కమిషనర్ నల్లనయ్యను కలిశారు. సకాలంలో రికార్డులను తమకు అప్పగించాలని కమిషనర్‌ను కోరారు. ఈ సమావేశంలో ఆడిట్ అధికారులు ప్రభావతి, సతిష్, కిషోర్, నగర పాలక సంస్థ గణాంక అధికారులు రోజా, వెంకటలక్ష్మి, నర్సింగరాజు పాల్గొన్నారు.

హెల్త్ అసిస్టెంట్లను తొలగించడం అన్యాయం

కొత్తవలస, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పురుష హెల్త్ అసిస్టెంట్లను తొలగించడం అన్యాయమని టీఎన్‌టీయూసీ అనుబంధ సంస ఏపీ గవర్నమెంట్ మెడికల్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శులు పద్మావతి, ఎల్.సత్యారావు అన్నారు. సోమవారం కొత్తవలసలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి పురుష హెల్త్ అసిస్టెంట్లు బాధితులకు సేవలు అందించారని తెలిపారు. తాజాగా రాష్ట్రంలో 12 మందిని, జిల్లాలో 56మందిని తొలగించడం అనాలోచిత నిర్ణయమని ఖండించారు. తొలగించిన వారందరినీ వెంటనే విధుల్లోకి తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు ఈశ్వరరావు, నరసింహారావు, ఎం.ఈశ్వరరావు తదితరుల ఎపాల్గొన్నారు.

అక్రమాలపై విచారణ చేపట్టాలి

విజయనగరం దాసన్నపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అదానీ అక్రమాలపై ఆధారాలు ఉన్నా.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎందుకు విచారణ చేపట్టడం లేదని సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ ప్రశ్నించారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బుగత అశోక్ ఆధ్వర్యంలో అమర్‌భవన్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకూ సోమవారం ర్యాలీ నిర్వహించారు. కాంప్లెక్స్ వద్ద మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ అదానీ గ్రూప్ కంపెనీల అవినీతి, తప్పిదాలపై కేంద్ర ప్రభుత్వం తక్షణమే పార్లమెంటు కమిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గత రాష్ట్ర ప్రభుత్వ హయాంలో చేసుకున్న ఒప్పందాలను రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ప్రతినిధులు రంగరాజు, రామకృష్ణ, జగన్నాథం, రాము తదితరులు పాల్గొన్నారు.

యోగా పోటీల్లో ప్రతిభ

గుర్ల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో స్థానిక కస్తూరిబా గాంధీ పాఠశాల విద్యార్థిని శ్రావణి పదో ర్యాంకు సాధించింది. విజయవాడలో జరిగిన ఈ పోటీల్లో పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న శ్రావణి పాల్గొన్నట్టు హెచ్‌ఎం తెలిపారు. ఈ మేరకు బాలికను పాఠశాల సిబ్బంది అభినందించారు.

క్షయ వ్యాధిపై అవగాహన

దత్తిరాజేరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఇంగిలాపల్లి గ్రామంలో డాక్టర్ కె.రఘు ఆధ్వర్యంలో సోమవారం క్షయ (టీబీ) వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రెండు వారాల పాటు దగ్గు, జ్వరం, బరువు తగ్గడం, ఛాతిలో నొప్పి, కఫంలో రక్తం కనిపించడం, రాత్రిపూట చెమటలు వంటివి ఉంటే అప్రమత్తం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ డీవీ గిరిబాబు, హెల్త్ సూపర్‌వైజర్ ఆర్. శ్రీనివాసరావు, హెల్త్ సూపర్‌వైజర్ జి.రాము, సీహెచ్‌వో ఎం.ప్రసన్న కుమార్, ఏఎన్‌ఎం ఆర్.ఈశ్వరమ్మ, డి.రామకృష్ణ పాల్గొన్నారు.

బహుళ పంటలతో ఆదాయం

బొండపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ విధానంలో బహుళ పంటలను సాగు చేయడం ద్వారా రైతులకు నిరంతర ఆదాయం లభిస్తుందని ప్రకృతి వ్యవసాయం ఆర్‌టీఐ ప్రకాష్ రైతులకు సూచించారు. దేవుపల్లి గ్రామంలో సోమవారం రైతులకు వీటిపై అవగాహన కల్పించారు. ఖరీఫ్ వరి కోతలు తర్వాత అపరాలతో పాటు పొలం గట్లపై వివిధ పంటలను సాగుచేయడం ద్వారా నిరంతరం ఆదాయంతో పాటు భూసారాన్ని కాపాడు కోవడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం ఎంటీలు సన్యాసి నాయుడు, సత్యవతి, రాము నాయుడు, ఉమ, అప్పల నాయుడు, ఎస్.అప్పలనాయుడు, పైడిరాజు, కొండమ్మ, రైతులు పాల్గొన్నారు.

తాగునీరు వృథా


గజపతినగరంలోని మేదర వీధిలో ఇలా...

గజపతినగరం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గజపతినగరం పట్టణంలో తాగునీటి సరఫరా చేసే పైపులైన్లు ఎక్కడికక్కడ దెబ్బతిన్నాయి. దీంతో తాగునీరు వృథాగా పోతోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక మేదర వీధిలో పైపుల ట్యాప్‌లు పని చేయకపోవడంతో నీటి సరఫరా సమయంలో వృథాగా పోతోంది. బజార్ సెంటర్‌లో ప్రపు లైన్లు లీక్ కావడంతో తాగునీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. తక్షణమే పైపులైన్లకు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

మూలకు చేరిన ఆర్వో ప్లాంట్

రేగిడి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): దేవుదళ కేజీబీవీ పాఠశాలకు నాడు-నేడులో కొత్తగా వచ్చిన ఆర్‌ఓ ప్లాంట్ ఏడాదిగా మూలకు చేరింది. ప్రిన్సిపాల్ ఎం.లక్ష్మి దీని మరమ్మత్తులకు సంబంధిత సంస్థకు నివేదించినా స్పందన లేదు. దీంతో విద్యార్థులకు శుద్ధ జలం అందడం లేదు. ఆర్‌ఓప్లాంట్‌కు ఐదేళ్ల వారెంటీ ఉండడంతో ప్రైవేటుగా మరమ్మత్తులు చేయలేకపోతున్నామని, సంబంధిత కంపెనీకి చెందిన టెక్నీషియన్స్ రావటం లేదని ప్రిన్సిపాల్ ఎం.లక్ష్మి తెలిపారు.

క్రైం కార్నర్

జరజాపుపేటలో వ్యక్తి ఆత్మహత్య

నెల్లిమర్ల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జరజాపుపేటలో మాత శ్రీనివాసరావు (54) అనే వ్యక్తి సోమవారం రాత్రి తన ఇంటిలోనే ఫ్యాన్ హుక్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ బి.గణేష్ తెలిపారు. కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పోలీసుల కథనం మేరకు... ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్న శ్రీనివాసరావు తాగుడుకు బానిస కావడంతో పాటు అనారోగ్యం పాలవడంతో జీవితం మీద విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు భావిస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం విజయనగరం సర్వజన ఆసుపత్రికి తరలించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారని తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి వినియోగిస్తున్న ముగ్గురి అరెస్టు

నెల్లిమర్ల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల డైట్ కాలనీ సమీపంలో బహిరంగ ప్రదేశంలో గంజాయి వినియోగిస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ బి.గణేష్ తెలిపారు. డైట్ కాలనీ ప్రాంతంలోని బాలికల గురుకుల పాఠశాల ప్రహరీ వెనుక సోమవారం మధ్యాహ్నం ముగ్గురు వ్యక్తులు గంజాయి సేవిస్తూ పట్టుబడ్డారని తెలిపారు. నిందితులలో స్థానిక డైట్ కాలనీకి చెందిన ఒక వ్యక్తి, కొండకరకాం పంచాయితీ ఊటగెడ్డ ప్రాంతానికి చెందిన మరో వ్యక్తి, నెల్లిమర్ల మండలం కోరాడపేటకు చెందిన ఒక వ్యక్తి ఉన్నారని తెలిపారు. వారి వద్ద 100 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు వివరించారు.

విజయనగరంలో..

విజయనగరం, క్రైం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గంజాయితో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్టు సీఐ శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. వన్‌టౌన్ ఎస్ఐ రాంగణేష్ సిబ్బందితో కలిసి తోటపాలెం శ్మశాన వాటిక వద్ద ముగ్గురు అనుమానిత వ్యక్తులను పట్టుకొని, వారి నుంచి 2 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్టు వివరించారు. కంటోన్మెంట్‌కు చెందిన జె.జ్యోతిప్రసాదు, విశాఖ జిల్లా పద్మనాభం మండలానికి చెందిన ఎ.భోగేశ్వర్, షేక్ ఇంతియాజ్ అలీ కలసి గంజాయి అమ్ముతుండగా అరెస్టు చేసినట్టు తెలిపారు.

సారా తయారీ కేంద్రాలపై దాడి

విజయనగరం క్రైం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సీతంపేట మండల శివార్లలో సారా విక్రయిస్తున్న వారిని అదుపులోకి తీసుకుని 40 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్టు ఎక్సైజ్, ఎన్‌ఫోర్సుమెంట్ సీఐ ఎస్ సింహాద్రి తెలిపారు. సారా విక్రయదారుడు కందుల గౌరీశంకర్‌ను అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ ఎస్‌వీ రామారావు, హెచ్‌సీ సుదర్శనకుమార్, కానిస్టేబుల్స్ రాము, మనోజ్‌లు పాల్గొన్నారు. అలాగే పాలకొండ గ్రామ పరిధిలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వందెల వెంకటరావును అదుపులోకి తీసుకుని పది మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. తదుపరి చర్యల నిమిత్తం పాలకొండ ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్‌కు అప్పగించినట్టు ఎస్ఐ సింహాద్రి తెలిపారు.

అక్రమ మద్యం విక్రయాలపై కొరడా

మెంటాడ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కుంతినవలస గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయాలపై ఆంధ్ర పోలీసులు కొరడా ఝుళిపించారు. ఎస్ఐ సీతారాం, సిబ్బంది ఆదివారం రాత్రి మెరుపుదాడులు నిర్వహించారు. ఒకచోట రూ.7,150తో పాటు 52 మద్యం క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అదే గ్రామంలో మరొకచోట జరుగుతున్న అక్రమ విక్రయాలపైనా దాడులు చేసి 46 క్వార్టర్ సీసాలను పట్టుకున్నారు. కేసు నమోదు చేశారు. ఒకరిని అదుపులోకి తీసుకోగా ఇంకో నిందుతుడు పరారయ్యారని ఎస్ఐ సీతారాం తెలిపారు.

పశువైద్యాధికారి మృతి

గరివిడి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): బొండపల్లి గ్రామంలో పశువైద్యాధికారిగా పనిచేస్తున్న శివ(38) ఆదివారం రాత్రి మృతిచెందారు. గత కొంతకాలంగా ఆయన కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. శివ మృతిపట్ల ప్రభుత్వ వైద్యాధికారులు, రైతులు సంతాపం తెలిపారు. మృతునికి భార్య, పిల్లలు ఉన్నారు.

సమస్యలపై సానుకూలంగా స్పందించండి


ఫిర్యాదుదారుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైం, డిసెంబరు 9: (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పట్ల సానుకూలంగా స్పందించి, చట్ట పరిధిలో చర్యలు తీసుకోవాలని ఎస్పీ వకుల్ జిందాల్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 27 ఫిర్యాదులు స్వీకరించారు. వీటిలో భూ తగాదాలకు సంబంధించి 9, కుటుంబ కలహాలవి ఒకటి, మోసాలకు పాల్పడినట్టు 5, ఇతర అంశాలకు సంబంధించి 12 ఫిర్యాదులు ఉన్నాయన్నారు. సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడి, చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తీసుకున్న చర్యలపై ఏడు రోజుల్లో జిల్లా పోలీసు కార్యాలయానికి నివేదించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ సౌమ్యలత, సీఐలు లీలారావు, ఆర్‌వీఆర్‌కే చౌదరి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ హెల్పర్‌ను విధుల్లోకి తీసుకోవాలి


రిలే దీక్షలు చేస్తున్న సిబ్బంది

విజయనగరం కలెక్టరేట్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): విధుల నుంచి అక్రమంగా తొలగించిన అంగన్‌వాడీ హెల్పర్ మానాపురం సౌజన్యను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు. గజపతినగరం మండలం రామన్నపేట అంగన్‌వాడీ హెల్పర్‌గా సౌజన్యను రాజకీయ వేధింపుల కారణంగా హెల్పర్ సౌజన్యపై ఒత్తిడి తీసుకుని వచ్చి విధుల నుంచి తొలగించారని వివరించారు. అప్పట్లో సౌజన్య ధ్రువపత్రాలు సక్రమంగా ఉన్నాయని... ఇప్పుడు ఎలా అక్రమం అవుతాయని సంఘ నాయకులు ప్రశ్నించారు. ఆమెను విధుల్లో తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు వి.లక్ష్మి, పైడిరాజు, కుమారి, హేమ, శ్యామల పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించాలి

గ్రీన్ అంబాసిడర్లకు వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ నాయుకులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ కనీస వేతనం రూ20 వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. మృతుని కుటుంబానికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు.

ఉత్తమ కవిగా లక్ష్మణరావు ఎంపిక

గరివిడి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తెలుగు వెలుగు జాతీయ వేదిక నిర్వహించిన జాతీయ కవితా పోటీల్లో గరివిడిలోని విశ్రాంత ఉపాధ్యాయులు ఉరిటి లక్ష్మణరావు ఉత్తమ కవిగా ఎంపికయ్యారు. ఆయన ఎంపిక పట్ల విశ్రాంత ఉద్యోగుల సంఘ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

● మంత్రులు అచ్చెన్నాయుడు, సంధ్యారాణి
● జిల్లాలో కూటమి నాయకులతో సమావేశం

పార్వతీపురం/రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తలు, నాయకులకు ఎన్డీఏ కూటమి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని వ్యవసాయ, మార్కెటింగ్ సహకార శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కె.అచ్చెన్నాయుడు తెలిపారు. సోమవారం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర క్యాంప్ కార్యాలయం వద్ద ఎన్డీఏ కూటమి జిల్లా నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'ఇటీవల జరిగిన ఎన్నికలు కురుక్షేత్రం సంగ్రామం తలపించాయి. ఎంతో మంది ముఖ్యమంత్రులను చూశాం. జగన్ లాంటి దుర్మార్గ సీఎంను మాత్రం ఇంతవరకూ చూడలేదు. అధికారంలో ఉంటే ప్రజలకు సేవ చేయడం, ప్రతి పక్షంలో ఉంటే ప్రజా సమస్యలపై పోరాడడం రాజకీయ పార్టీలకు అలవాటుగా ఉండేది. కానీ జగన్ సీఎం అయ్యాక వైసీపీయే శాశ్వతంగా అధికారంలో ఉండాలని, ఇతర రాజకీయ పార్టీలు ఉండకూడదనే దురద్దేశంతో పాలన చేశారు. ఇటువంటి దుర్మార్గమైన వ్యక్తిని ఎన్నడూ చూడలేదు. ప్రజలు గత ఎన్నికల్లో సరైన గుణపాఠం చెప్పారు. ఒక్క అవకాశమని అధికారంలోకి వచ్చి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారు. జగన్ లాంటి వ్యక్తి రాజకీయాల్లో ఉండకూడదు. రాష్ట్రానికి, దేశానికి జగన్ చాలా ప్రమాదకరం. తాత తండ్రులు సంపాదించిన భూములను లాక్కోవాలని కుట్రపన్నారు. తప్పుడు చట్టాలు, ల్యాండ్ టైటిల్ యాక్టు తీసుకొచ్చారు. ఆ చట్టాన్ని ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే రద్దు చేశాం. రాష్ట్ర ప్రజలు ఎంతో నమ్మకంతో అధికారాన్ని ఇచ్చారు. అది గుర్తుపెట్టుకుని నాతో సహా ప్రతి ఒక్కరూ ప్రజలకు సేవ చేయాలి. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అధ్వానంగా ఉన్నా ఇచ్చిన హామీలు అమలు చేయడానికి ప్రయత్నం చేస్తున్నాం. పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఎంతో కృషి చేస్తున్నారు. రాష్ట్రంలో వైసీపీ చేసిన భూ కబ్జాలు, దందాలపై 40 లక్షల అర్జీలు వచ్చాయి.' అని తెలిపారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి మాట్లాడుతూ.. ఐదేళ్ల వైసీపీ పాలనలో.. ఎన్నో కష్టాలు, ఇబ్బందులు ఎదుర్కొన్న కార్యకర్త, నాయకులకు అండగా ఉంటాం. అర్హులందరికీ సంక్షేమ పథకాలు మంజూరు చేస్తాం. జిల్లాలో ఇరిగేషన్, వ్యవసాయంతో పాటు ప్రతీ శాఖను గత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసింది. జిల్లా అభివృద్ధి కోసం సీఎం చంద్రబాబు నాయుడు ఎంతో శ్రమిస్తున్నారు. ఆయనకు ప్రతి ఒక్కరూ అండగా ఉండాలి.' అని కోరారు. అనంతరం నాలుగు నియోజకవర్గాలకు చెందిన కొంతమంది అభిప్రాయాలను మంత్రులు తెలుసుకున్నారు. ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి మాట్లాడుతూ కురుపాం నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని కోరారు. ఎమ్మెల్యేలు బోనెల విజయచంద్ర, నిమ్మక జయకృష్ణ మాట్లాడుతూ గత ఎన్నికల్లో వైసీపీకి కోవర్టులుగా పని చేసిన వారిపై తగు చర్యలు తీసుకోవాలన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే ఆర్పీ భంజ్‌దేవ్, జనసేన నాయకులు పాలూరి బాబు, కూటమి కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న మంత్రులు అచ్చెన్న, సంధ్యారాణి, ఎమ్మెల్యేలు జయకృష్ణ, విజయచంద్ర

బాధితులకు న్యాయం చేస్తాం

● ఏఎస్పీ దిలీప్‌కిరణ్ ● పీజీఆర్ఎస్‌కు 5 వినతులు



ఫిర్యాదుదారుల సమస్యలు వింటున్న ఏఎస్పీ దిలీప్‌కిరణ్

బెలగాం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు ఐదు ఫిర్యాదులు అందినట్టు ఏఎస్పీ ఓ.దిలీప్‌కిరణ్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ఆయన ఆధ్వర్యంలో పీజీఆర్ఎస్ నిర్వహించారు. ఏఎస్పీ నేరుగా అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. సమగ్ర విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని అన్నారు. ఎక్కువగా కుటుంబ కలహాలు, సైబర్ మోసాలు, అధిక వడ్డీ, భూ తగాదాలు తదితర సమస్యలపై వినతులు అందాయన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఆర్‌బీ సీఐ ఎర్రంనాయుడు, సోషల్ మీడియా సెల్ సీఐ శ్రీనివాసరావు తదితర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ఐటీడీఏ పీజీఆర్ఎస్‌కు 31 వినతులు

సీతంపేట రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ఏపీవో జి.చిన్నబాబు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 31 వినతులు వచ్చాయి. భరిణికోట గ్రామానికి సీసీ రహదారి నిర్మించాలని సవర రంగారావు కోరారు. పంట పొలాలకు నీటి సౌకర్యం కోసం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని ఓండ్రుజోల గ్రామానికి చెందిన సవర వెంకటరావు కోరారు. కిరప పాఠశాలకు అదనపు భవనం మంజూరు చేయాలని నిమ్మక రమేష్‌బాబు వినతిపత్రం అందజేశారు. ఇలా అనేక సమస్యల పరిష్కారం కోరుతూ పీజీఆర్ఎస్‌కు వినతులు వచ్చాయి. పీజీఆర్ఎస్‌లో ఏపీవోతో పాటు డీడీ అన్నదొర, డిప్యూటీ డీఈవో పి.నారాయుడు పలు శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

12 నుంచి అధికారులకు శిక్షణ

గరుగుబిల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అధికారులకు, సిబ్బందికి ఈనెల 12వ తేదీ నుంచి 19 వరకు శిక్షణ ఇస్తున్నట్టు ఎంపీడీవో జి.పైడితల్లి తెలిపారు. సోమవారం ఆమె విలేకర్లతో మాట్లాడారు. 12, 13 తేదీల్లో మండల స్థాయి అధికారులు, విలేజ్ సర్వేయర్లు, ఏఎన్ఎంలు, పశు సంవర్ధక శాఖ, మత్స్యశాఖ సిబ్బంది, విద్యుత్‌శాఖ లైన్‌మెన్లకు శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. అలాగే 16, 17 తేదీల్లో సర్పంచ్‌లు, డిజిటల్ అసిస్టెంట్లు, వ్యవసాయ సిబ్బంది, వీఆర్వోలకు, 18, 19 తేదీల్లో పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులకు శిక్షణ ఇస్తున్నట్టు ఆమె వివరించారు. ఈ శిక్షణకు మండలంలోని ఆయా శాఖల సిబ్బంది విధిగా హాజరు కావాలన్నారు.

ఆధునిక పద్ధతులపై దృష్టి సారించాలి

గరుగుబిల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రైతులు ఆధునిక వ్యవసాయ విధానాలపై దృష్టి సారించాలని కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డా.ఎస్.ధ్రువ కోరారు. సోమవారం సంతోషపురం గ్రామంలో నైరా వ్యవసాయ కళాశాల విద్యార్థులు రైతు సదస్సుతో పాటు వ్యవసాయ ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమయంలో రైతులు ప్రకృతి వ్యవసాయంపై శ్రద్ధ చూపాలన్నారు. నైరా వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.భరతలక్ష్మి మాట్లాడుతూ ఎగుమతులకు అనువుగా ఉండే పంటలను సాగు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నైరా కళాశాల ప్రొఫెసర్ డా.బి.రాజేంద్రకుమార్, శాస్త్రవేత్తలు, సర్పంచ్ అంబటి తవిటినాయుడు తదితరులు పాల్గొన్నారు.

పాచిపెంట హెచ్‌ఎంపై విచారణ



విచారణ నిర్వహిస్తున్న డిప్యూటీ డీఈవో రాజకుమార్

పాచిపెంట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బి.ఈశ్వరరావుపై డిప్యూటీ డీఈవో రాజకుమార్ సోమవారం విచారణ నిర్వహించారు. ఈనెల 7వ తేదీన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశంలో భోజనాలు బాగోలేవంటూ తల్లిదండ్రులు ఆందోళన చేశారు. కొంతమంది భోజనాలు చాలక ఆకలితో వెనుదిరిగారు. విషయం తెలుసుకున్న డీఈవో.. విచారణకు ఆదేశించడంతో డిప్యూటీ డీఈవో సోమవారం ఆ పాఠశాలలో విచారణ చేపట్టారు. ఈక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ యడ్ల రమేష్ మరోసారి లిఖిత పూర్వకంగా హెచ్‌ఎంపై ఫిర్యాదు చేశారు. దర్యాప్తు నిర్వహించి సమగ్ర నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తానని డిప్యూటీ డీఈవో తెలిపారు.

తుఫాన్‌పై అప్రమత్తంగా ఉండాలి

గరుగుబిల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశం ఉందని, రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారిణి ఆర్.విజయభారతి సూచించారు. సోమవారం ఆమె మాట్లాడుతూ వరి పంట కోతకు సమయం అయినా కోత కోయకుండా వాయిదా వేసుకోవాలన్నారు. నూర్పు చేసిన ధాన్యం నిల్వలను భద్రపర్చుకోవాలని సూచించారు. అలాగే రైతుసేవా కేంద్రాలకు అందించేందుకు ధాన్యం సిద్ధమైతే కేంద్రాలకు తరలించాలని ఆమె సూచించారు. పెసర, మినుము, వరి పంటలకు సంబంధించి ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలన్నారు.

ధాన్యాన్ని భద్రపరుచుకోండి

వీరఘట్టం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రైతులు ధాన్యాన్ని భద్రపరుచుకోవాలని మండల వ్యవసాయ అధికారిణి సౌజన్య సూచించారు. సోమవారం వరి కోతలు కోస్తున్న రైతులకు ఆమె పలు సూచనలు చేశారు. తుఫాన్ ప్రభావం పొంచి ఉన్నందున రైతులు ధాన్యాన్ని భద్రపరుచుకోవాలని అన్నారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు ముందుకు వెళ్లాలని ఆమె సూచించారు.

ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళి

పార్వతీపురం రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): జిల్లాకు సోమవారం విచ్చేసిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడుతో పాటు స్థానిక మంత్రి సంధ్యారాణి నర్సిపురం గ్రామంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి, నివాళి అర్పించారు. వారికి ఎమ్మెల్యేలు బోనెల విజయచంద్ర, జయకృష్ణ ఘన స్వాగతం పలికారు. మాజీ వైఎస్ ఎంపీపీ గొట్టాపు గౌరీ ఆధ్వర్యంలో టీడీపీ మహిళా విభాగం ప్రతినిధులు హారతులు ఇచ్చారు. పార్టీ మండల అధ్యక్షుడు బోను దేవీ చంద్ర మౌళి, పార్టీ నాయకులు జి.వెంకటనాయుడు, జి.వెంకట రమణ, బి.సీతారాం, ఆర్.వేణు పాల్గొన్నారు.

కనీస వేతనం ఇవ్వాలి

పార్వతీపురం రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): తమకు కనీస వేతనం రూ.20వేలు చెల్లించాలని ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు జిల్లా ఇన్‌చార్జి మంత్రి అచ్చెన్నాయుడుకు వినతిపత్రాన్ని అందజేశారు. సోమవారం జిల్లాకు విచ్చేసిన ఇన్‌చార్జి మంత్రికి తమ సమస్యలను వివరించారు.

మంత్రుల దృష్టికి లిఫ్ట్ ఇరిగేషన్

జియ్యమ్మవలస, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో లిఫ్ట్ ఇరిగేషన్ ప్రక్రియ సమస్యను టీడీపీ అరకు పార్లమెంటు నియోజకవర్గ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ.. మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. సోమవారం జిల్లాకే విచ్చేసిన ఇన్‌చార్జి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుతో పాటు మంత్రి గుమ్మిడి సంధ్యారాణిని ఆయన కలిశారు. లిఫ్ట్ ఇరిగేషన్ సమస్యను వివరించారు. టీడీపీ మండల అధ్యక్షుడు పల్ల రాంబాబు, తోటపల్లి దేవస్థానం మాజీ చైర్మన్ మూడడ్ల సత్యంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి వేదపండితుల ఆశీర్వాదం

పార్వతీపురం/టౌన్, డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడుకు వేద పండితులు ఆశీర్వాదం అందించారు. సోమవారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలో సమావేశానికి విచ్చేసిన ఆయనకు శ్రీవిద్యా సర్వమంగళాదేవి పీఠ వ్యవస్థాపకులు మురపాక కాళిదాసు శర్మ అమ్మవారి ఆశీస్సులను అందించారు. అమ్మవారి శేష వస్త్రాలు, ప్రసాదాన్ని అందించారు.

రైతు సమస్యలపై మాట్లాడే హక్కు జగన్‌కు లేదు

పార్వతీపురం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో నెట్టి, గత ఐదేళ్లలో వ్యవసాయ రంగాన్ని విస్మరించిన మాజీ సీఎం జగన్‌కు రైతు సమస్యలపై మాట్లాడే హక్కు లేదని జిల్లా ఇన్‌చార్జి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. సోమవారం విలేఖర్లతో మాట్లాడుతూ.. 'గత వైసీపీ పాలనలో అన్ని వ్యవస్థలు నిర్వీర్యమయ్యాయి. వైసీపీ నాయకులు ఇసుక, మద్యం మాఫియాగా ఏర్పడి దోపిడీకి పాల్పడ్డారు. అన్ని శాఖలపై సమీక్ష చేస్తే రాష్ట్రం కోలుకోలేని అప్పుల ఊబిలో ఉందని తేలింది. మాజీ సీఎం జగన్ మోహన్‌రెడ్డి రూ. 12.50 లక్షల కోట్ల మేర అప్పులు చేశారు. జగన్ రాష్ట్రానికే ప్రమాదకరం. సమస్యలు ఉన్నాయని భయపడకుండా సీఎం చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం పింఛన్ రూ.3 వేల నుంచి రూ.4 వేలు పెంచారు. పాలనా వ్యవస్థను గాడిలో పెడుతున్నారు. ఇప్పటికే అన్న క్యాంటీన్‌ను తెరిపించాం. త్వరలోనే రైతులకు అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేలు ఇస్తాం. త్వరలో రూ.140 కోట్లతో రైతులకు అవసరమైన యంత్రాలను అందిస్తాం. సీఎం చంద్రబాబును జైలుకు పంపిస్తాం.. అధికారంలోకి వస్తాం అని ఎంపీ విజయసాయి రెడ్డి అనడం హాస్యాస్పదంగా ఉంది. అధికారంలో ఉన్న మేము తలచుకుంటే 20రోజుల్లో వైసీపీ అవినీతి నేతలను జైల్లో పెట్టగలం. కానీ చట్ట ప్రకారం నడుచుకుంటాం. విద్యుత్ ట్రూ ఆప్ చార్జీలు వైసీపీ హయాంలోనే పెంచారు. దానిని ఇప్పుడు తగ్గించలేం. ఈ పాపం వైసీపీదే. ఐదేళ్లుగా వైసీపీ అబద్ధాలతో ప్రజలను మోసగించింది.' అని తెలిపారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి

● ఖాళీ బిందెలతో మహిళల నిరసన



ఎంపీడీవో కార్యాలయం ముందు ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

సీతానగరం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదభోగిలి మేజర్ పంచాయతీ అప్పయ్యపేటలో గల ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు తాగునీటి సమస్యను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల అధ్యక్షుడు రెడ్డి ఈశ్వరరావు మాట్లాడుతూ రెండు నెలలుగా అప్పయ్యపేట ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు తాగునీటి సమస్య పరిష్కరించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈకి, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్‌కు, అలాగే ఇన్‌చార్జి ఈవోకు విన్నవిస్తున్నామని చెప్పారు. అయినా నేటికీ సమస్య పరిష్కరించకపోవడంతో ఎంపీడీవో కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టామని తెలిపారు. ప్రస్తుతం జల జీవన్ పేరుతో ఇంటింటికి కొళాయిలు వేసినప్పటికీ ఆ కొళాయిలు సక్రమంగా పనిచేయకపోవడంతో సుమారు 20 కుటుంబాలకు తాగునీటి సమస్య నెలకొందన్నారు. అనంతరం ఎంపీడీవో త్రివిక్రమరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఇప్పటివరకు ఈ సమస్య తన దృష్టికి రాలేదని, రెండు మూడు రోజుల్లో సమస్యను పరిష్కరించే దిశగా ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. దీంతో ఆందోళనకారులు వెనుదిరిగారు. గురువారం లోపు సమస్య పరిష్కారం కాకపోతే శుక్రవారం జాతీయ రహదారిపై నిరసన కార్యక్రమం తప్పదని వారు హెచ్చరించారు.

గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

సీతంపేట రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం సోమగండి, జిల్లేడుపాడు, శంభాం, కొండ చొర్లంగితో పాటు మరో రెండు గ్రామాల్లో తహసీల్దార్ పి.అప్పలరాజు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సదస్సుల్లో ఆరు గ్రామాల నుంచి భూ సమస్యలపై 60 వినతులు వచ్చాయి. రెండు బృందాలుగా నిర్వహిస్తున్న ఈ రెవెన్యూ సదస్సుల్లో తహసీల్దార్‌తో పాటు డీటీ శ్రీవిద్య, ఆర్ఐ వెంకటేష్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వీఆర్వోల సంఘం మండలాధ్యక్షుడిగా బలరాం

జియ్యమ్మవలస, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వీఆర్వోల సంఘం మండల అధ్యక్షుడిగా రాయిపిల్లి బలరాం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ ఎన్నిక జరిగింది. ఇందులో ఉపాధ్యక్షుడిగా వెంకటరమణ, సెక్రటరీగా గంట సురేష్, జాయింట్ సెక్రటరీగా కోమటపల్లి పద్మ, ట్రెజరర్‌గా మిరియాల హరికృష్ణ, గౌరవాధ్యక్షుడిగా దూసి తిరుపతిరావును ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులు ఆర్.వినాయక, బి.చిన్నపుదొర, డి.రౌద్రమ్మ, డి.మోహనరావు, దుర్గాప్రసాద్‌లు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

కురుపాం, డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): కురుపాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం పోలీసు శాఖ ఆధ్వర్యంలో వివిధ నేరాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా కానిస్టేబుల్ లక్ష్మి మాట్లాడుతూ మహిళపై జరుగుతున్న నేరాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, తదితర మోసాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాలపై అవగాహన కలిగిఉండాలని సూచించారు. కార్యక్రమంలో మహిళా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

వీరఘట్టం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని యు.వెంకంపేట జంక్షన్ వద్ద స్థానిక ఎస్ఐ జి.కళాధర్ వాహన చోదకులకు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. వాహన చోదకులు తప్పక హెల్మెట్‌ను ధరించాలని, అతివేగం ప్రమాదకరమని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్ఐ సూచించారు. ఆయన తోపాటు పోలీసు సిబ్బంది ఉన్నారు.

నేడు న్యాయ అవగాహన సదస్సు

పార్వతీపురం, డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్టు రెండవ అదనపు జిల్లా జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ అధ్యక్షుడు ఎస్.దామోదరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆదేశాల మేరకు ఉదయం 9.30 గంటలకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఆయన చెప్పారు.

గుణుపూర్‌లో వినతుల స్వీకరణ



వృద్ధాప్య పింఛన్ అందజేస్తున్న కలెక్టర్ పారుల్, పక్కన ఎస్పీ స్వాతి



రాయగడ, డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి): జిల్లా యంత్రాంగం సోమవారం గుణుపురం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో వినతుల స్వీకరణ కార్యక్రమం నిర్వహించింది. కలెక్టర్ పారుల్ పట్వారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎస్పీ స్వాతి ఎస్.కుమార్, గుణుపూర్ సబ్ కలెక్టర్ కిరణ్‌దీప్ కౌర్, జిల్లా పరిషత్ కార్యనిర్వాహణాధికారి అక్షయ్‌కుమార్ ఖెముండి, జిల్లా కేంద్ర ముఖ్య వైద్యాధికారి లాల్ మోహన్ రౌత్రాయ్, గుణుపూర్ ఆదివాసీ సంక్షేమాభివృద్ధి సంస్థ అధ్యక్షుడు అజయ్‌కుమార్ ప్రధాన్ తదితరులు పాల్గొని అర్జీదారుల సమస్యలను తెలుసుకున్నారు. మొత్తం 61 ఫిర్యాదులు వచ్చాయి. అర్జీదారుల్లో ఇద్దరికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.40వేలు ఆర్థిక సహాయం అందజేశారు. మరో ఇద్దరికి వృద్ధాప్య పింఛన్ మంజూరు చేశారు. మిగిలిన వాటిని త్వరితగతిన పరిష్కరించవలసిందిగా కలెక్టర్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.